

తుమ్మన్‌పల్లి పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

ఝరాసంగం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): విధులను నిర్లక్ష్యం చేసిన సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండల పరిధిలోని తుమ్మన్‌పల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి జాకీర్‌ఖాన్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఈమేరకు సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. విధులను నిర్లక్ష్యం చేయడంతోపాటు గ్రామ శివారులో అక్రమంగా నిర్మిస్తున్న రైస్‌మిల్లును తొలగించాలని గతంలో జారీచేసిన ఆదేశాలను పాటించకపోవడంతోనే ఆయనపై చర్యలు తీసుకున్నట్టు తెలుస్తున్నది.

వందేళ్లయినా.. వన్నె తగ్గలే

- శతాబ్ది వేడుకలకు మెదక్ చర్చి ముస్తాబు
- నిర్మాణంలో దేనికదే ప్రత్యేకత
- వైభవంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యుల ఏర్పాట్లు
- ముఖ్యఅతిథిగా సీఎం రేవంత్‌రెడ్డి, చార్లెస్ వాకర్ కుటుంబ సభ్యులు

7



చర్చి కిటికీ అద్దాలపై పెయింటింగ్స్



చర్చి నిర్మాత చార్లెస్ వాకర్ కుటుంబ సభ్యులు

అక్షరం కనిపించేలా..

బడి పిల్లల్లో కంటి సమస్యలపై దృష్టి

- సంగారెడ్డి జిల్లాలో 4,792 మందికి ఇబ్బందులు
- ముగిసిన 'స్కూల్ ఐ స్క్రీనింగ్' ప్రోగ్రాం
- 78 రోజుల్లో 93,563 మందికి కంటి పరీక్షలు

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సర్వేంద్రియానాం నయనం ప్రధానం అన్నారు. కంటి చూపు సరిగ్గా ఉంటే చదువులో రాణించగలరు. బడి పిల్లల్లో కంటి సమస్యలపై ప్రభుత్వం దృష్టిపెట్టింది. ఇందుకోసం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో 'స్కూల్ ఐ స్క్రీనింగ్ ప్రోగ్రాం' నిర్వహించింది. 78 రోజుల పాటు నిర్వహించిన కార్యక్రమంలో వేల సంఖ్యలో పిల్లల్లో సమస్యలున్నట్టు గుర్తించారు. పౌష్టికాహారం లేమి, మొబైల్ ఫోన్ వాడకంతోనే పిల్లల్లో దృష్టి సమస్యలు ఉత్పన్నమవుతున్నట్లు తేల్చారు.

78 రోజుల పాటు ఐ స్క్రీనింగ్

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నివసించే పేద విద్యార్థులకు సరైన పోషకాహారం లభించక నేత్ర సమస్యలతో బాధపడుతున్నారు. అలాంటివారికి బాసటగా నిలవాలన్న ఉద్దేశంతో వైద్య ఆరోగ్యశాఖ ముందస్తుగా బడి పిల్లల్లో దృష్టిలోపాలను గుర్తించి, అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు, మందులు, చికిత్స అందజేయాలని నిశ్చయించారు. ఇందులో భాగంగా తొమ్మిది రాష్ట్రీయ బాల స్వస్థ బృందాలతో రెండు విడతల్లో 78 రోజుల పాటు 'స్కూల్ ఐ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని' చేపట్టింది. ఈ ఏడాది ఏప్రిల్ 8 నుంచి 23 వరకు, తిరిగి ఆగస్టు 20 నుంచి నవంబరు 29 వరకు జిల్లావ్యాప్తంగా కంటి పరీక్షలు నిర్వహించారు. జిల్లాలోని ట్రైబల్, సోషల్ వెల్ఫేర్ స్కూళ్లలో ఒకటి నుంచి పదో తరగతి వరకు, అన్ని సర్కారు పాఠశాలల్లో 5 నుంచి 10 తరగతుల వరకు కంటి పరీక్షలు నిర్వహించారు.



ప్రభుత్వ పాఠశాలలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న ఆర్‌బీఎస్‌కే బృందం (ఫైల్)

ఉచితంగా కళ్లద్దాలు

జిల్లాలోని ఆయా సర్కారు విద్యాసంస్థల్లో 93,563 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా 4,792 మంది దృష్టి సమస్యలతో బాధపడుతున్నట్లు గుర్తించారు. ఇందులో బాలురు 1,605 మంది, బాలికలు 3,187 మంది ఉన్నట్లు తేల్చారు. వీరికి వైద్య ఆరోగ్య శాఖ త్వరలో కళ్లద్దాలను ఉచితంగా అందజేయనుంది. విద్యార్థుల్లో కంటి సమస్యలు వెలుగు చూస్తున్న నేపథ్యంలో పకడ్బందీ చర్యలు తీసుకోవాలని విద్యావేత్తలు పేర్కొంటున్నారు.

అంధత్వ నివారణకు చర్యలు

బడి పిల్లల్లో దృష్టి సమస్యలను గుర్తించడానికి రెండున్నర నెలల పాటు 'స్కూల్ ఐ స్క్రీనింగ్' పేరిట ఆర్‌బీఎస్‌కే బృందాలతో పరీక్షలు నిర్వహించాం. వేల సంఖ్యలో విద్యార్థుల్లో కంటి చూపు సమస్యలు వెలుగుచూశాయి. వారికి అవసరమైన వైద్య సేవలు నిరంతరం కొనసాగిస్తాం.

- శశాంక్‌దేశ్‌పాండే, ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్

ఇంటింటికి ఇంటర్నెట్..

టీ ఫైబర్ పైలట్ ప్రాజెక్టుగా సంగుపేట

- ప్రతీ ఇంటికీ టీవీ, వైఫై, ఫోన్ సేవలు
- తొలి మూడు నెలలు ఉచితం
- గ్రామంలో బీఎస్ఎన్ఎల్, ఏసీఎస్ లాయల్ సంస్థల ముమ్మర సర్వే



సంగుపేట గ్రామపంచాయతీలో టీ-ఫైబర్ కనెక్షన్‌తో టీవీని వీక్షిస్తున్న అధికారులు, గ్రామస్థులు

జోగిపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఇంటింటికీ ఇంటర్నెట్ సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన టీ-ఫైబర్ సేవలు అందోలు మండలం సంగుపేట గ్రామంలో ప్రారంభమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం బీఎస్ఎన్ఎల్‌తో కలిసి టీ-ఫైబర్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పైలెట్ ప్రాజెక్టుగా రాష్ట్రంలో మూడు గ్రామాలను ఎంపిక చేయగా అందులో సంగుపేట ఒకటి. సాంకేతిక సహాయం కోసం బీఎస్ఎన్ఎల్ సంస్థ ఏసీఎస్ లాయల్ అనే ప్రైవేటు సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. గ్రామంలో 300 ఇళ్లుండగా ప్రతీ ఇంటికి ఇంటర్నెట్ సేవలందించడానికి అవసరమైన ఏర్పాట్లు చేయడం కోసం బీఎస్ఎన్ఎల్, ఏసీఎస్ లాయల్ సంస్థల సభ్యులు గ్రామంలో సర్వే చేస్తున్నారు. వారాంతం వరకు సర్వే పూర్తిచేసి నెలాఖరులోగా ప్రతీ ఇంటికి టీ-ఫైబర్ కనెక్షన్ అందించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. పంచాయతీ కార్యాలయంలో తొలి కనెక్షన్‌ను బిగించారు.

రూ. 300కే సేవలు

వినియోగదారులకు తొలి మూడు నెలలు టీ-ఫైబర్ సేవలు ఉచితంగా అందించనున్నారు. ఆ తరువాత ప్రతీ నెల కేవలం రూ. 300 చెల్లించాల్సి ఉంటుంది. ఇతర సంస్థలతో పోల్చితే ఈబిల్లు నామమాత్రమే అని చెప్పవచ్చు. ఈ కనెక్షన్‌తో టెలిఫోన్ సేవలు, టీవీ ఛానళ్లు, ఓటీటీలను పొందవచ్చు. ఈ పథకంపై గ్రామస్థుల స్పందన బాగుందని పంచాయతీ కార్యదర్శి లీల సాయి ఈశ్వరి పేర్కొన్నారు. గ్రామాన్ని డిజిటలైజ్ చేయడానికి ఇది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. సంగుపేట పైలట్ ప్రాజక్టుగా ఎంపికకావడం గర్వంగా ఉందని, ప్రతీ ఇంటికి టీ-ఫైబర్ కనెక్షన్ అందజేస్తామని ఎంపీడీవో రాజేశ్ తెలిపారు.

పారదర్శకంగా, పక్కాగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే

రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమ్



సంగారెడ్డిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ఎండీ గౌతమ్

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పారదర్శకంగా, పక్కాగా నిర్వహించాలని రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమ్ ఆదేశించారు. సంగారెడ్డి పట్టణంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను శుక్రవారం ఆయన కలెక్టర్ వల్లూరు క్రాంతితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ గృహాల పంపిణీకి అర్హులనే గుర్తించాలని, అధికారుల నివేదిక ఆధారంగానే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. ఇళ్ల కోసం దరఖాస్తు చేసినవారు తమ సమస్యలను నేరుగా ఉన్నతాధికారులకు తెలిపే అవకాశం లభించిందన్నారు. అనంతరం కలెక్టర్ వల్లూరు క్రాంతి మాట్లాడుతూ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నవారికి ఏమైనా సందేహాలుంటే మున్సిపాలిటీ పరిధిలో వార్డు అధికారిని, గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శిని సంప్రదించాలని చెప్పారు. వారి వెంట అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ట్రైనీ కలెక్టర్ మనోజ్, గృహనిర్మాణ సంస్థ జిల్లా మేనేజర్ పుష్పలత, తహసీల్దార్ దేవదాసు, కౌన్సిలర్ వనిత సంతోష్ కుమార్ తదితరులు ఉన్నారు.

కొల్లూరు డబుల్‌బెడ్రూం కాలనీలో వసతులపై ఆరా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రామచంద్రాపురం, డిసెంబరు 13: సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరులోని డబుల్ బెడ్‌రూం ఇళ్లలో వసతులపై తెలంగాణ రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ఎండీ వీపీ గౌతమ్, అధికారులు ఆరా తీశారు. ఈ నెల 9న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'ఉంటే ఉండండి.. పోతే పోండి' కథనంపై ఆయన స్పందించి కాలనీని శుక్రవారం సందర్శించారు. 15,660 ఇళ్లు ఉండగా ఇప్పటివరకు ఎంతమంది ఇళ్లలో చేరారని అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, విద్యుత్, పారిశుధ్య సౌకర్యాలపై ఆరా తీశారు. మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి మాట్లాడుతూ 5వేల ఇళ్లలో లబ్ధిదారులు చేరారని, నెలాఖరుకు మిగితా ఇళ్లలో లబ్ధిదారులు చేరుతారని తెలిపారు. కాలనీవాసులకు ఇబ్బంది కలిగితే సహించేది లేదని అధికారులను ఎండీ హెచ్చరించారు. సమస్యలుంటే తమకు ఫిర్యాదు చేయాలని లబ్ధిదారులకు సూచించారు. మునిసిపల్ డీఈఈ సత్యనారాయణ, ఆర్వో వెంకటరామయ్య, మేనేజర్ నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.



మోడువారినా మళ్లీ చిగురించె..

నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని చాంద్‌ఖాన్‌పల్లి వద్ద రహదారి పక్కన ఉన్న చెట్టు కొన్నేళ్ల క్రితం ఎండిపోయింది. ఇన్నేళ్ల అనంతరం మోడు మళ్లీ చిగురించింది. ఎన్నేళ్లయినా ఆశలు వదులుకోవద్దని.. మంచిరోజులు వస్తాయని చెప్తున్నట్టు ఉన్న ఈ చెట్టును అటుగా వెళ్లేవారు ఆసక్తితో చూస్తున్నారు. విరిగిన కొమ్మలను తొలగించి వృక్షానికి రక్షణ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

-నారాయణఖేడ్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి)

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు : కలెక్టర్



టి.మాందాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల యాప్ సర్వేను పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

చిన్నశంకరంపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అర్హులైన లబ్ధిదారులకే ఇందిరమ్మ ఇళ్లు అందేలా లబ్ధిదారుల గుర్తింపు సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. చిన్నశంకరంపేట మండలంలోని టీ. మాందాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల మొబైల్ యాప్ సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామపంచాయతీలు, నాలుగు మునిసిపాలిటీల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే పారదర్శకంగా కొనసాగుతుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ళల సర్వే నిరంతర ప్రక్రియ అని పేర్కొన్నారు. శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఉంటున్నవారికి కొత్త ఇళ్లు నిర్మించుకునేందుకు సహాయం చేస్తామని తెలిపారు. సర్వేలో లోటుపాట్లు లేకుండా జాగ్రత్తగా లబ్ధిదారుల వివరాలను పొందుపరచాలన్నారు. సర్వే వేగవంతం అయ్యేందుకు సంబంధిత పత్రాలను దరఖాస్తుదారులు అందుబాటులో ఉంచుకునేలా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. అనంతరం సర్వే వివరాలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజలను అడిగి వివరాలు తెలుసుకొని, శిథిలావస్థలో ఉన్న ఇళ్లను మొబైల్ ద్వారా చిత్రీకరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో దామోదర్, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.



నేల.. నీరు.. ఏదైనా!

సంగారెడ్డి జిల్లా కంది మండలం ఎద్దుమైలారం ఓడీఎఫ్‌లో తయారుచేసిన అధునాతన యుద్ధ ట్యాంకర్ల ట్రయల్‌రన్‌ను కొండాపూర్ మండలం మల్కాపూర్ పెద్దచెరువులో నిర్వహించారు. ఓడీఎఫ్ చీఫ్ జనరల్ మేనేజర్ శివశంకర్ ప్రసాద్ పూజలు ప్రారంభించారు. వీక్షించేందుకు మల్కాపూర్ గ్రామస్థులు తరలివచ్చి యుద్ధట్యాంకర్ల వద్ద ఉత్సాహంగా ఫొటోలు, సెల్ఫీలు దిగారు.

-సంగారెడ్డి జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్





రూ.1,100 కోట్లతో 7 సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, డిసెంబరు, 13 (ఆంధ్రజ్యోతి): కాలుష్యజలాలు, మురుగునీటితో జీవం కోల్పోయిన పటాన్‌చెరు నియోజకవర్గంలోని చెరువులు, కుంటలకు పూర్వవైభవం తెచ్చేందుకు అమృత్-2 పథకం కింద 7 సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల ఏర్పాటుకు రూ. 1,100 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం కేటాయించిందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి వెల్లడించారు. పటాన్‌చెరులోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలోని తెల్లాపూర్ మేళ్లచెరువు, బీరంగూడ ఇసుకబావి, పటాన్‌చెరు ఇక్రిశాట్, గండిగూడెం, బచ్చుగూడెం, అమీన్‌పూర్‌లో ఎస్టీపీ ప్లాంట్లను ఏర్పాటు చేస్తారని పేర్కొన్నారు. ఇందుకోసం అనువైన స్థలాలను కేటాయించాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. ఇందుకు అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వం 25 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 35 శాతం కేటాయిస్తాయని, మిగిలిన 40 శాతం బిల్ట్-ఆపరేట్-ట్రాన్స్‌ఫర్ పద్ధతిలో కాంట్రాక్టు పొందిన సంస్థ వెచ్చిస్తుందని వివరించారు. పటాన్‌చెరు పట్టణంలోని సాకిచెరువు, తిమ్మక్కచెరువు, ఐడీఏ బొల్లారం పారిశ్రమల ద్వారా కలుషితమైన గండిగూడ, చెరువు, ఆసానికుంట, సుల్తాన్‌పూర్ పెద్దచెరువులు, అమీన్‌పూర్‌లోని పెద్దచెరువు, బంధకొమ్ము చెరువుతో పాటు గొలుసుకట్టు చెరువులను శుద్ధి చేస్తారన్నారు. సమావేశంలో జలమండలి డీజీఎంలు బాబు, దీపాలి, శ్రీనివాస్‌రావు, తహసీల్దార్లు రంగారావు, రాధ, సంగ్రామ్, భిక్షపతి, గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

132 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

రామచంద్రాపురం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి) : శంషాబాద్ నుంచి కర్ణాటక రాష్ట్రానికి అక్రమంగా తరలిస్తున్న 132 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కొల్లూరు పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. కొల్లూరు మీదుగా నగరం నుంచి అక్రమంగా రేషన్‌బియ్యాన్ని తరలిస్తున్నారన్న విశ్వసనీయమైన సమాచారం మేరకు ఎస్‌ఐ రమేశ్ అవుటర్ రింగ్ రోడ్డుపై కాపుకాచి బియ్యాన్ని పట్టుకున్నారు. బియ్యాన్ని పటాన్‌చెరు సివిల్ సప్లై అధికారిణి తేజశ్వినికి అప్పగించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దొంగకు రిమాండ్


నిందితుడు మహ్మద్ హమీద్

రామచంద్రాపురం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి) : దొంగను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ జగన్నాథ్ కథనం ప్రకారం.. ఈ నెల 8న రామచంద్రాపురం పట్టణంలోని సాయినగర్‌కాలనీలో రిటైర్డ్ హెడ్‌కానిస్టేబుల్ రామకృష్ణారావు ఇంట్లో 46 తులాల బంగారం, 20 తులాల వెండి ఆభరణాలతో పాటు రూ.13 వేలు చోరీకి గురైంది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ పుటేజీల ఆధారంగా గురువారం రాత్రి నిందితుడిని రామచంద్రాపురంలో అదుపులోకి తీసుకుని విచారించగా అతని పేరు మహ్మద్ హమీద్(20) మెహదీపట్నంలో నివాసముంటున్నట్లు చెప్పాడు. సాయినగర్ దొంగతనంతో పాటు గతంలో నేరెడ్‌మెట్, కుషాయిగూడ, దోమలగూడలో 2, రామచంద్రాపురంలో 2, సంజీవరెడ్డినగర్, కూకట్‌పల్లి పోలీసుస్టేషన్ల పరిధిలో దొంగతనాలు చేసినట్టు నిందితుడు అంగీకరించాడు. అతడి నుంచి 15 తులాల బంగారు ఆభరణాలను రికవరీ చేశారు.

బాలమేళాతో సృజనాత్మకత వెలుగులోకి..

● జిల్లా సంక్షేమ అధికారి హైమావతి


బాలమేళాలో మాట్లాడుతున్న హైమావతి

శివ్వంపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : బాలమేళా కార్యక్రమంతో బాలల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీసే అవకాశం ఉంటుందని జిల్లా సంక్షేమ అధికారి హైమావతి, సీడీపీవో హేమాభార్గవి అన్నారు. మండల పరిధిలోని దొంతి గ్రామంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోష, వసుమతి ఆధ్వర్యంలో దాతలు భవనగారి శీను, వడ్ల శ్రీకాంత్, అంజి సహకారంతో శుక్రవారం బాలమేళా నిర్వహించారు. హైమావతి, హేమభార్గవి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ మేళాలో పిల్లలు మట్టి పాత్రలు, స్టోరీ థియేటర్, పప్పీ హౌస్‌తోపాటు ప్రకృతిసిద్ధంగా సేకరించిన వస్తువులను ప్రదర్శనకు ఉంచగా.. వారు సందర్శించి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కృషి గ్రామీణ విజ్ఞాన సంస్థ చైర్మన్ లక్ష్మీకాంతరావు, భవనగారి శీను, శ్రీకాంత్, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

రూప్లాతండాలో వైద్య శిబిరం

శివ్వంపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : టీబీ ప్రచార దినోత్సవంలో భాగంగా శుక్రవారం రత్నాపూర్ ఉపకేంద్రం పరిధిలోని రూప్లాతండా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న 112 మంది వలస కార్మికులకు హెల్త్ క్యాంపులో ఎక్స్‌రేతో పాటు 8 మందికి సీబీఎన్‌ఏటీ ద్వారా పరీక్షలు నిర్వహించారు. ఇందులో ఒకరికి పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యిందని వైద్యాధికారి సాయిసౌమ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రాజేశ్వరి, సృజన, ఎంపీహెచ్ఈవో మహేష్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రూప్-2కు భారీ బందోబస్తు

● 200 మంది పోలీసులతో భద్రతా చర్యలు
● పరీక్షా కేంద్రాల వద్ద 163 సెక్షన్ అమలు
● మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి


ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఈనెల 15, 16వ తేదీల్లో గ్రూప్-2 పరీక్షలకు జిల్లాలో 200 మంది పోలీసులతో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నటుల మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రూప్-2 పరీక్షలకు జిల్లాలో మొత్తం 19 కేంద్రాలను ఏర్పాటు చేశారని, ఆయా కేంద్రాల వద్ద సెక్షన్ 163 యాక్ట్ (భారతీయ నాగరిక్ సురక్షా సంహిత) అమలులో ఉంటుందన్నారు. రెండు రోజులు పాటు ఆంక్షలు అమలులో ఉంటాయని, పరీక్ష కేంద్రాలకు 200 మీటర్ల దూరంలో ఐదుగురికి మించి గుంపులుగా ఉ ండరాదన్నారు. సభలు, ర్యాలీలు, మైకులు, డీజేలతో ఊరేగింపు, ధర్నాలు, ప్రచారాల వంటి నిర్వహించరాదన్నారు. పరీక్ష సమయంలో పరిసరాల్లో ఇంటర్నెట్, జిరాక్స్, స్టేషనరీ షాపులు మూసివేయాలని సూచించారు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా పోలీసులు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు గంటన్నర ముందుగానే కేంద్రానికి చేరుకోవాలన్నారు. అభ్యర్థులను క్షుణ్ణంగా పరీక్షించాకే లోపలకు పంపుతామన్నారు. నిమిషం ఆలస్యమైన లోనికి ఎవరినీ అనుమంతించమని ఆయన తెలిపారు. సమావేశంలో అదనపు ఎస్పీ మహేందర్, మెదక్, తూప్రాన్ డీఎస్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాలను పరిశీలించిన ఆర్డీవో రమాదేవి

మెదక్ పట్టణంలో గ్రూప్-2 పరీక్షలు నిర్వహించే పరీక్షా కేంద్రాలను శుక్రవారం మెదక్ ఆర్డీవో రమాదేవి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెదక్‌లో 11 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారని, అన్ని వసతులు కల్పిస్తున్నామన్నారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

తూప్రాన్‌లోనూ..

తూప్రాన్, డిసెంబరు 13: (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణంలోని గ్రూప్-2 పరీక్షా కేంద్రాలను శుక్రవారం తూప్రాన్ ఆర్డీఓ జయచంద్రారెడ్డి పరిశీలించారు. తూప్రాన్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీచైతన్య హైస్కూల్‌లలో గ్రూపు-2 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఒక్కొక్క కేంద్రంలో 288 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతున్నట్లు వివరించారు.

‘వజ్రా’ సేవలు వినియోగించుకోవాలి

● సంగారెడ్డి ఎస్పీ రూపేష్


పోలీసులకు సూచనలిస్తున్న జిల్లా ఎస్పీ రూపేష్

సంగారెడ్డి క్రైం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బాంబు డిస్పోజబుల్ బృందంలో విధులు నిర్వర్తించే సిబ్బంది అన్ని రకాల సెక్యూరిటీ విధుల గురించి తెలుసుకోవాలని, ముఖ్యంగా వజ్ర వాహనాన్ని వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ రూపేష్ సూచించారు. సంగారెడ్డిలోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో కొత్తగా నియామకమైన ఏఆర్ సిబ్బందితో బాంబు డిస్పోజబుల్ బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం వారికి జిల్లా ఎస్పీ పలు సూచనలు చేశారు. ఎస్పీ మాట్లాడుతూ సిబ్బంది ప్రతి ఒక్కరూ అన్ని రకాల విధుల గురించి తెలుసుకోవాలన్నారు. వీఐపీల కార్యక్రమాలు ఉన్న సమయంలో ముందుగా బాంబు డిస్పోజబుల్ టీం వీఐపీలు వెళ్లే మార్గాన్ని, ప్రసంగించాల్సిన ప్రదేశాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతనే కార్యక్రమాలు ప్రారంభమవుతాయని అన్నారు. ఈ సందర్భంగా వజ్ర వాహనాన్ని ఎలాంటి సందర్భంలో వినియోగించాలి, వజ్ర వాహనాన్ని ఉపయోగించి స్మోక్, రబ్బర్ బుల్లెట్లతో ఏ విధంగా ఫైర్ చేయాలనే స్వయంగా ఫైర్ చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు రామారావు, డానియల్, మురళీధర్, నారాయణరావు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలి

● మంత్రులకు వినతి


మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వెల్దుర్తి/హత్నూర డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఎస్ఎస్ఏ ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి.. వారిని క్రమబద్ధీకరించాలని ఎస్టీటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికేల వెంకటేశం అన్నారు. శుక్రవారం రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేసి మాట్లాడారు. ఎన్నేళ్లుగా వెట్టిచాకిరీ గురవుతూ విద్యావ్యవస్థను ఎంతో ప్రభావితం చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు ఉద్యోగ భద్రత కోసం చేస్తున్న నిరవధిక సమ్మె వల్ల విద్యావ్యవస్థ కాంప్లెక్స్ నుంచి జిల్లా స్థాయి వరకు కుంటుపడిందన్నారు. వెంటనే ప్రభుత్వం ఎస్ఎస్ఏ ఉద్యోగులకు తక్షణమే పేస్కేల్‌ను అమలుచేయాలని కోరారు. స్పందించిన మంత్రులు సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తానని చెప్పినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీటీయూ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు సంకినేని మధుసూదన్‌రావు, సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, ఎస్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి, డీపీవో వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ పీటర్‌లో సృజనాత్మక సదస్సు

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని సెయింట్ పీటర్స్ పాఠశాలలో విద్యార్థుల సృజనాత్మక సదస్సు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రీ ప్రైమరీ విద్యార్థులు అందమైన చిత్రాలతో కనువిందు చేసే ప్రాజక్టులను రూపొందించి ప్రదర్శించారు. ఈ సందర్భంగా అంథోనీస్ విద్యాసంస్థల చైర్మన్ అంథోనిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తమ మనసులోని భావాలను చక్కగా వ్యక్తం చేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ అడ్వైజర్ రూబెన్‌రెడ్డి, పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ రవికుమార్ రెడ్డి, లీడ్ అకాడమిక్ ఎక్సలెంట్ మేనేజర్ వరలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


సృజనాత్మక సదస్సులో పాల్గొన్న చిన్నారులు

వందేళ్లయినా.. వన్నె తగ్గలే

- శతాబ్ది వేడుకలకు మెదక్ చర్చి ముస్తాబు
- నిర్మాణంలో దేనికదే ప్రత్యేకత
- వైభవంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యుల ఏర్పాట్లు
- ముఖ్యఅతిథిగా సీఎం రేవంత్‌రెడ్డి, చార్లెస్ వాకర్ కుటుంబ సభ్యులు



మెదక్ కల్చరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ చర్చి వందేళ్లను పూర్తిచేసుకున్నది. రాళ్లు, డంగు సున్నంతో నిర్మించిన ఈ కళాత్మక కట్టడం వలన నేటికీ చెక్కుచెదరకుండా.. ఏ మాత్రం వన్నె తగ్గకుండా తళతళలాడుతున్నది. వందేళ్లకు పూర్వం ఇంగ్లాండ్ నుంచి వచ్చిన పాస్నెట్ ఇక్కడ ఆకలితో అలమటిస్తున్న ప్రజలను చూసి, వారి ఆకలిని తీర్చాలనే ఉద్దేశంతో పనికి ఆహారపథకంలో భాగంగా ఈ చర్చి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. సుదీర్ఘకాలం పాటు నిర్మాణం కొనసాగగా, పనులు మొదలైన నాటి నుంచి పదేళ్లకు కరుణామయుడి ప్రార్థనలకు అందుబాటులోకి వచ్చింది. ఆసియాలోనే అతిపెద్ద ప్రార్థనా మందిరంగా పేరుగాంచింది.

అద్భుత కట్టడం

మెదక్ చర్చి నిర్మాత చార్లెస్ వాకర్ పాస్నెట్. ఆయన ఇంగ్లాండ్ దేశస్థుడు. ఇంగ్లాండ్‌లోని షఫీల్డు నగరానికి చెందిన పాస్నెట్ మెథడిస్టు సంఘంలో పాస్టర్‌గా అభిషేకం పొంది క్రైస్తవ మత ప్రచారం కోసం 1895లో ఇండియాకు వచ్చారు. సికింద్రాబాద్ తిరుమలగిరిలోని గ్యారిస్టర్ చర్చిలో పాస్టర్‌గా నియమితుడయ్యాక కొన్నాళ్ల తర్వాత గ్రామీణ ప్రాంతంలో సువార్త సేవలందించాలని నిర్ణయించుకున్నాడు. 1897లో ఆయన హైదరాబాద్‌కు వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న మెదక్ పట్టణంలోని చర్చికి పంపించారు. ఆ సమయంలో మిషన్ కాంపౌండ్‌లోని రెండంతస్తుల భవనంలో నివాసం ఉండే పాస్నెట్ తన నివాసం కంటే చర్చి చిన్నగా ఉండటాన్ని గమనించారు. అది నచ్చక ఏసుక్రీస్తుకు పెద్ద చర్చి నిర్మించాలని తలచి ఈ మహాదేవాలయ నిర్మాణానికి పూనుకున్నారు. నాడు కరువుఛాయలతో అల్లాడుతున్న మెదక్ ప్రాంతంలో ఆకలితో అలమటించడాన్ని గమనించిన ఆయన చర్చి నిర్మాణంతో బీదలకు పని కల్పించారు. అలా 1914లో ప్రారంభమైన చర్చి నిర్మాణం పదేళ్ల పాటు కొనసాగి 1924లో పూర్తయింది. దేవుడికి గుడి నిర్మించాలన్న తన సంకల్పాన్ని నెరవేర్చుకోవడంతోపాటు తీవ్రమైన కరువు నెలకొన్న సమయంలో వేలాది మంది పనికి ఆహారం ద్వారా పేదలకు పనికల్పించి వారి కడుపునింపారు.

విశాలమైన నిర్మాణం

174 అడుగుల ఎత్తు, 100 అడుగుల వెడల్పు, 200 అడుగుల పొడవుతో విశాలంగా నిర్మించిన మెదక్ చర్చి కళాత్మక కట్టడంగా పేరుగాంచింది. దీనికి ఇంగ్లాండ్ ఇంజనీర్ బ్రాడ్‌షా దాదాపు 200 నమూనాలు రూపొందించి అందులో ప్రస్తుత చర్చి నమూనాను ఎంపిక చేయడం విశేషం. వాస్తు శిల్పి థామస్ ఎడ్వర్డు సూచనలకు అనుగుణంగా నిర్మించారు. దేశ, విదేశీ నిర్మాణ రంగ నిపుణుల పర్యవేక్షణలో యూరప్ గోతిక్ శైలిలో చర్చి రూపుదిద్దుకుంది. చర్చిలోని ప్రత్యేక ప్రార్థన మందిరం ఒకే సారి 5000 మంది వరకు ప్రార్థన చేయవచ్చు.

దేశ విదేశాల నుంచి భక్తుల రాక

మెదక్ చర్చికి తెలుగు రాష్ట్రాల నుంచే కాక కర్ణాటక, మహారాష్ట్ర, దేశ విదేశాల నుంచి భక్తులు వస్తుంటారు. ప్రతీ ఆదివారం మహాలయంలో పెద్దఎత్తున నిర్వహించే ప్రార్థనలకు దూరప్రాంతాల నుంచి భక్తులు వస్తూనే ఉంటారు. ప్రతీ ఏటా క్రిస్మస్ వేడుకలకు ఈ చర్చికి లక్షలాది భక్తులు తరలివస్తారు. మెదక్‌లో జాతీయ రహదారి 44పై హైదరాబాద్‌కు 90 కిలోమీటర్ల దూరంలో ఈ చర్చి ఉన్నది.

శతాబ్ది ఉత్సవాలకు సీఎం రేవంత్‌రెడ్డి రాక

ప్రపంచంలోనే అత్యుత్తమ కట్టడాల్లో ఒకటైన మెదక్ సీఎస్ఐ చర్చిని కట్టి డిసెంబర్ 25తో వంద సంవత్సరాలు పూర్తి కానుంది. ఈసారి క్రిస్మస్ సంబురాలను వైభవంగా నిర్వహించేందుకు చర్చి ప్రెసిబేటరీ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. సాధారణంగా క్రిస్మస్ వేడుకల్లో లక్షలాదిగా జనం పాల్గొంటారు. ఆరోజు భక్తులకు ఇబ్బంది కలగకుండా 23న శతాబ్ది ఉత్సవ కార్యక్రమాన్ని నిర్వహించ తలపెట్టారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ముఖ్యఅతిథిగా ఆహ్వానించినట్లు చర్చి నిర్వాహకులు తెలిపారు. 23న 15 మంది బిషప్‌లతో ప్రత్యేక ప్రార్థన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో చర్చి నిర్మాత చార్లెస్ వాకర్ పాస్నెట్ కుటుంబ సభ్యులను ప్రెసిబేటరీ కమిటీ ఆహ్వానించింది.

> **భక్తుల సౌకార్యార్థం అభివృద్ధి కార్యక్రమాలు**
>
> భక్తులకు ఎలాంటి అవంతరాలు ఎదురవకుండా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నాం. ఈ సంవత్సరంతో చర్చి కట్టడానికి 100 ఏళ్లు నిండిన సందర్భంగా పలు కార్యక్రమాలను చేపడుతున్నాం. ఈ సారి రాష్ట్ర ముఖ్యమంత్రి రానుండడం శుభపరిణామం. చర్చి నిర్మాణం చేసిన చార్లెస్ వాకర్ పాస్నెట్ కుటుంబ సభ్యులు కూడా వచ్చే అవకాశం ఉంది. అంగరంగా వైభవంగా వేడుకలు జరుపడానికి ఏర్పాట్లు చేస్తున్నాం.
>
> **- గంట సంపత్, చర్చి కమిటీ కోశాధికారి**

..లేదంటే కారుణ్య మరణాన్ని ప్రసాదించండి

- సహారా బాధితుల ఆందోళన
- కోహెడ్ నుంచి హుస్నాబాద్‌కు పాదయాత్ర



కోహెడలో ఆందోళన చేస్తున్న సహారా బాధితులు

కోహెడ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సహారా ఇండియా ఖాతాదారులకు డిపాజిట్ చేసిన సొమ్మును వెంటనే తిరిగి చెల్లించి న్యాయం చేయాలని కోరుతూ బాధితులు ఆందోళన చేశారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా కోహెడ నుంచి హుస్నాబాద్ వరకు పాదయాత్ర ప్రారంభించారు. 'మా ప్రాణాలైనా కాపాడాలని లేకుంటే.. కారణ్య మరణాన్ని ప్రసాదించాలని' బ్యానర్ చేత పట్టుకొని పాదయాత్ర చేపట్టారు. కోహెడ మండల కేంద్రంలో వాడవాడల తిరుగుతూ ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. సహార సంస్థ పైన ఉన్న నిషేధాన్ని కొనసాగించాలంటూ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధితులకు సీఆర్‌సీఎస్ ద్వారా చేపట్టే చెల్లింపులు బ్యాంకుల ద్వారా చెల్లించాలని కోరారు. సుప్రీంకోర్టు వడ్డీతో బాధితులకు వారి డిపాజిట్ సొమ్మును చెల్లించాలని ఆదేశాలు జారీ చేసినా ఇంతవరకు పట్టించుకునే నాథుడే లేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి సహారా సంస్థలో ఉన్న బాధితులకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సుమారు 20 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేపట్టి రాత్రి 7 గంటల వరకు పాదయాత్ర హుస్నాబాద్‌కు చేరుకుంది. కార్యక్రమంలో బాధితులు పూజిత మిశ్రా, బాలరాజు, బాలయ్య అరుణ, అమీనా, మంజుల, పద్మావతి, లావణ్య, విజయ, వనజ, రామలింగం, నరేష్, వివిధ జిల్లా నుండి వచ్చిన బాధితులు పాల్గొన్నారు. శనివారం హుస్నాబాద్ నుంచి హనుమకొండ జిల్లా ముల్కనూరు వరకు ఈ పాదయాత్ర జరుగుతుందని, ఉదయం 10 గంటలకు ప్రారంభం అవుతుందని పూజిత మిత్ర తెలిపారు.



ఎన్ని చక్రాలో..

పాపన్నపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పెట్రోలియం గ్యాస్ నిల్వచేసే పెద్ద యంత్రాన్ని తీసుకొని హైదరాబాద్ నుంచి గుజరాత్ రాష్ట్రానికి 74 చక్రాలున్న భారీ వాహనం బయలుదేరింది. ఈ వాహనం మెదక్-బొడ్మట్‌పల్లి ప్రధాన రోడ్డుపై శుక్రవారం ప్రయాణించడంతో వాహనదారులు ఆసక్తిగా తిలకించారు.

రూ.3లక్షలకు తేలని లెక్క..

- కల్హేర్‌లో ఈజీఎస్ ప్రజాదర్బార్
- రూ.96 వేలు దుర్వినియోగం



కల్హేర్‌లో సమీక్ష నిర్వహిస్తున్న అధికారులు

కల్హేర్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కల్హేర్ మండలంలో చేపట్టిన ఈజీఎస్ పనులకు సంబంధించి ఎంపీపీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. 2023-2024 ఆర్థిక సంవత్సరంలో మండలంలోని 26 గ్రామ పంచాయితీల్లో ఈ నెల 2 నుంచి 12 వరకు డీఆర్పీలు సామాజిక తనిఖీకి నిర్వహించారు. ఈ వివరాలను ప్రజాదర్బార్‌లో గ్రామ పంచాయితీల వారీగా చదివి వినిపించారు. మొత్తానికి రూ.96 వేలు దుర్వినియోగం చేసినట్లు తేలగా రికవరీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే లెక్కలు తేలని రూ.3 లక్షలకు సంబంధించిన వివరాలు సమర్పించాలని ఫీల్డు అసిస్టెంట్లకు నోటీసులు జారీ చేసినట్లు డీఆర్డీఏ అదనపు పీడీ బాల్‌రాజ్ తెలిపారు. కార్యక్రమంలో సామాజిక తనిఖీ విజిలెన్స్ అధికారి నాగేశ్వరరావు, జిల్లా ప్లాంటేషన్ మేనేజర్ మణికుమార్, ఈజీఎస్ సామాజిక తనిఖీ స్టేట్ రిసోర్స్ పర్సన్ మహేష్, ఎంపీడీవో రమేష్‌బాబు, ఏపీవో శ్యాంకుమార్, ఈసీ వేణుమాధవ్, టీఏలు శ్రీనివాస్ రెడ్డి, బస్సీలాల్, తులసీరామ్, శివశంకర్, గ్రామ పంచాయితీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

- ఎప్డీసీ రాష్ట్ర మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

వర్గల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ పరిసర ప్రాంతంలో టీఎస్ఐఐసీ కోసం భూములు కోల్పోయిన రైతులకు కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఎప్డీసీ రాష్ట్ర మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం వర్గల్ మండలం అవుసులోనిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని టీఎస్ఐఐసీ భూముల వద్ద రైతులకు మద్దతు తెలుపుతూ మాట్లాడారు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మూడు విడతల వారిగి రైతుల నుంచి పరిశ్రమల ఏర్పాటు కోసం టీఎస్ఐఐసీ ద్వారా 1150 ఎకరాలు భూములు సేకరించిందన్నారు. అప్పటి కలెక్టర్ వెంకట్రామరెడ్డి టీఎస్ఐఐసీ కోసం భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ.10 లక్షలతో పాటు 250 చదరపు గజాల ప్లాటు ఇచ్చారన్నారు. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు పొన్నం ప్రభాకర్, జీవన్‌రెడ్డి, కొదండరాం, రాజనర్సింహ రైతుల వద్దకు వచ్చి కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఎకరాకు రూ. 50లక్షలు, ఇంట్లో ఎందరు ఉంటే అందరికి ప్లాట్లు ఇస్తామని టీఎస్ఐఐసీ భూముల వద్ద టెంట్లు వేసి మరీ దీక్ష చేశారన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి ఉందని అప్పుడిచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. అదేవిధంగా పరిశ్రమలు కేటాయించిన భూముల్లో ఇటీవల కొందరు నాయకులు టెంట్లు వేయించి రైతులతో ఆందోళన చేయించారన్నారు. రూ.3 లక్షలు ఇప్పిస్తామని రైతులకు బాండ్ పెపర్ రాసిచ్చి ఆందోళన విరమింపజేశారని, తీరా ఇప్పుడు లక్ష ఇస్తామనడం సరికాదన్నారు. రైతులకు న్యాయం చేయ్యాలని లేనిపక్షంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.



బాధిత రైతులకు మద్దతు తెలుపుతూ నినాదాలు చేస్తున్న ఎప్డీసీ రాష్ట్ర మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

కూరగాయల సాగుకే మొగ్గు..

- వరి కంటే ఆరుతడి పంటలే మేలు
- నూతన పద్ధతులు, మెళకువలతో అధిక లాభాలు
- యాసంగిలో సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం



డ్రిప్‌తో సాగు చేసిన మిర్చి పంట

సిద్దిపేట రూరల్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి) : మార్కెట్లో కూరగాయలకు మంచి డిమాండ్ ఉండడంతో సిద్దిపేట రూరల్ మండల రైతులు ఆ దిశగా పంటల సాగుకు ఆసక్తి చూపుతున్నారు. ఆధునిక పద్ధతుల్లో కూరగాయల సాగు చేపడుతూ మంచి లాభాలు పొందుతున్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించేందుకు కొత్త పద్ధతులను అనుసరిస్తున్నారు. తీగజాతికి సంబంధించిన బీర, కాకర, బోడ కాకర, సోరకాయ వంటి పంటలను పందిరి, లేదా పాలీహౌజ్‌లు ఏర్పాటు చేసి సేంద్రియ ఎరువుల వినియోగంతో సాగు చేస్తున్నారు. చిన్న, సన్నకారు రైతులు 4 లేదా 5 గుంటల విస్తీర్ణంలో పాలీహౌజ్‌లు ఏర్పాటు చేసుకుని కీర, టమాట, కొత్తిమీర, ఇతర ఆకు కూరలు పండిస్తున్నారు. సిద్దిపేట రూరల్ మండలంలోని బుస్సాపూర్, వెంకటాపూర్, బచ్చాయిపల్లి, పెద్దలింగారెడ్డిపల్లి, నారాయణరావుపేట మండలం గుర్రాలగొంది, మల్యాల, మాటిండ్ల, లక్ష్మీదేవిపల్లి, ఇబ్రహింపూర్ గ్రామాల్లో వరి, మక్కజొన్న, పొద్దుతిరుగుడు పంటలతో కూరగాయలు పెద్ద ఎత్తున సాగు చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో దాదాపుగా 300లకు పైగా ఎకరాల్లో పలు రకాల కూరగాయలు, ఆకు కూరలు సాగవుతున్నాయి. యాసంగిలో కూరగాయల సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

సేంద్రియ సాగుకు ఎక్కువ డిమాండ్..

రోజూ నిద్ర లేచింది మొదలు మానవులు తమ దైనందిన జీవితంలో తీసుకునే ప్రతీ ఆహారం రసాయన ఎరువులతో తయారైనవే కావడంతో ఆరోగ్యం దెబ్బతింటుంది. ప్రస్తుతం ప్రజల్లో ఆరోగ్యంపై శ్రద్ధ పెరగడంతో సేంద్రియ ఎరువులతో పండించిన కూరగాయలకు కొనుగోలుకు మొగ్గు చూపుతున్నారు. దీంతో వీటికి మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్నది. దీంతో రైతులు సైతం సేంద్రియ పద్ధతుల్లో పంటల సాగుపై దృష్టి సారించారు. యువ రైతులు ఆధునిక సాంకేతికతను వినియోగించుకుని కూరగాయల పంటల సాగులో విజయం సాధిస్తున్నారు.

> **పాలీహౌజ్‌లతో పంటకు చీడపీడల బెడద ఉండదు...**
>
> 
>
> కూరగాయల సాగు మంచి లాభాలు గడించవచ్చు. ఇది ఆర్థిక ఎదుగుదలకు తోడ్పాటునిస్తుంది. ఐదు గుంటల్లో పాలీహౌజ్ ఏర్పాటు చేసుకుని టమోటా, కీర, ఆకు కూరలు సాగు చేశాను. పాలీహౌజ్ వల్ల వాతావరణంలో మార్పులు వచ్చినప్పటికీ ఆరోగ్యకరమైన పంట దిగుబడి వచ్చింది. చీడపీడల బెడద కూడదు ఉండదు.
>
> **-దండవేణి సుమన్, యువరైతు, మాటిండ్ల**
>
> **కూరగాయల సాగుతో ప్రతి రోజూ ఆదాయం..**
>
> 
>
> ఫోటో13ఎస్ఐడి157; నాంపల్లి ప్రశాంత్, యువరైతు, శేఖర్ రావుపేట
>
> నాకున్న కొంత భూమిలో మిర్చి, కాకర, ఆకు కూరలు, ఉల్లి, వెల్లుల్లి వంటి పంటలు సాగు చేస్తున్నా. నిటి వసతి తక్కువగా ఉండడంతో మిర్చి పంటకు డ్రిప్ ఏర్పాటు చేసాను. ఖాళీ స్థలంలో ఆకుకూరలు, మిర్చి పంట చుట్టూ కాకర సాగు చేశాను. కూరగాయలతో నిత్యం ఆదాయం ఉంటుంది.
>
> **-నాంపల్లి ప్రశాంత్, యువరైతు, శేఖర్ రావుపేట**

క్రైం కార్నర్

వాహనం ఢీకొని ఒకరి మృతి

- ఇద్దరికి గాయాలు



అరుణ్(ఫైల్)

తూప్రాన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, ఇద్దరు గాయపడ్డారు. పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. శివంపేట మండల కేంద్రానికి చెందిన ఇసుగారి అరుణ్ (19), మనోహరాబాద్ మండలం లింగారెడ్డిపేట గ్రామానికి చెందిన కొలను పాక (నర్సగోని) శ్రీనివాస్‌గౌడ్, పాలాట గ్రామానికి చెందిన నీలం మహేందర్ గురువారం తూప్రాన్‌లో స్నేహితుడి జన్మదిన వేడుకలకు హాజరయ్యారు. అనంతరం గురువారం రాత్రి ముగ్గురు ద్విచక్రవాహనంపై తిరిగి వెళ్తుండగా మున్సిపల్ కార్యాలయం వద్ద యూ టర్న్‌లో రోడ్డు క్రాస్ చేస్తుండగా హైదరాబాద్ వైపు వెళ్తున్న బొలెరో వాహనం ఢీకొట్టింది. దీంతో అరుణ్ అక్కడికక్కడే మృతిచెందగా, శ్రీనివాస్‌గౌడ్, మహేందర్ గాయపడ్డారు ఇరువురిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో గృహిణి..



అనిత(ఫైల్)

నర్సాపూర్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో గృహిణి మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్ఐ-2 శ్రీనివాస్ కథనం ప్రకారం నర్సాపూర్ మండలం ఎర్రకుంటతండా పంచాయతీ బాల్యాతండాకు చెందిన హలవత్ అనిత(27), శ్రీనివాస్ దంపతులు గురువారం రాత్రి కుటుంబ సభ్యులంతా భోజనం చేశాక పడుకునే సమయంలో టీ తాగుదామని అనిత వంటింట్లో వెళ్లింది. అక్కడున్న స్టీలు స్టాండ్‌లో గ్లాసు తీసే క్రమంలో అప్పటికే తేలిన విద్యుత్ తీగ దానికి తగిలి ఉండటంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి భర్త శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య



నర్సింహులు (ఫైల్)

తూప్రాన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అదృశ్యమైన వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ శివానందం కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. తూప్రాన్ మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన పల్లపు వడ్డె నర్సింహులు (48) రాయి కొడుతూ జీవనం సాగిస్తున్నాడు. పెళ్లీడుకొచ్చిన కూతురు ఉండడం, ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో గురువారం సాయంత్రం ఎవరికి చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. కాసేపటికి సోదరుడు పల్లపు అశోక్‌కు ఫోన్ చేసి తన కూతురును జాగ్రత్తగా చూసుకోవాలని చెప్పి ఫోన్ పెట్టేశాడు. అనంతరం ఎన్నిసార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడం, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, శుక్రవారం మల్కాపూర్ శివారు అటవీ ప్రాంతంలో పల్లపు నర్సింహులు ఓ చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని కనిపించాడు. సోదరుడు అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానందం తెలిపారు.

అప్పుల బాధతో యువకుడు..

మిరుదొడ్డి, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): అప్పులబాధతో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మిరుదొడ్డి మండలం పెద్దచెప్యాల గ్రామానికి చెందిన బెస్త గొల్లనర్సయ్య కుమారుడు బెస్త గొల్లస్వామి స్థానిక డబుల్‌బెడ్రూం ఇండ్లలో నివాసం ఉంటున్నాడు, ఆయనకు భార్య, కూతురు ఉండగా, వ్యవసాయ కూలి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొన్నాళ్లుగా అప్పుల బాధతో మానసిక వేదనతో గురవుతున్నాడు. దీంతో శుక్రవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులకు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దుబ్బాక ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు



ప్రథమ చికిత్స అందిస్తున్న అంబులెన్స్ సిబ్బంది

మద్దూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. బచ్చన్నపేట మండలం సాల్వాపూర్ గ్రామానికి చెందిన ప్రభాకర్ మద్దూరు మండలం లద్నూరులోని అత్తగారింటికి వచ్చాడు. గురువారం జనగామ జిల్లా కేంద్రంలోని ఎల్ఐసీ కార్యాలయంలో ఆధార్‌కార్డు సబ్‌మిట్ చేయడానికి ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. లద్నూరు డ్యాం సమీపంలోని స్పీడ్ బ్రైకర్ వద్ద వెల్దండ వైపు వెళ్తున్న టాటా ఏసీ వాహనం సడన్‌గా బ్రేక్ వేయడంతో ప్రభాకర్ ప్రమాదవశాత్తు ఆ వాహనాన్ని వెనుక నుంచి బలంగా ఢీ కొట్టాడు. ఈ ఘటనలో అతని ఎడమకాలు పాదంపైన శీల మండలం భాగం విరిగింది. అతడిని 108లో సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు అంబులెన్స్ ఈఎంటీ వెంకట్, పైలట్ శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు.

వృద్ధురాలి పుస్తెలతాడు చోరీ

హుస్నాబాద్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ పట్టణంలోని నాగారం రోడ్డులో ఓ వృద్ధురాలి మెడలో నుంచి గుర్తుతెలియని వ్యక్తులు పుస్తెలతాడు చోరీ చేసిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పోతారం(ఎస్) గ్రామానికి చెందిన బొద్దుల లక్ష్మి వైద్యం కోసం హుస్నాబాద్‌కు వచ్చింది. ఆసుపత్రిలో చూపించుకొని తిరిగి ఇంటికి వెళుతుండగా నాగారం రోడ్డులోని బస్టాండ్ వెనకాల సిమెంట్ దుకాణం ఎదుట ఆమెను గుర్తు తెలియని వ్యక్తులు ఆపారు. నిన్న ఇక్కడ దాడి జరిగిందని, నీ మెడలో ఉన్న పుస్తెలతాడును టవల్‌లో దాచిపెడదాం అని చెప్పి బంగారాన్ని తీసుకొని టవల్‌లో రాళ్లు పెట్టి ఇచ్చి పరుగులు పెట్టారు. దీంతో అనుమానం వచ్చిన లక్ష్మి అరవడంతో జనం గుమ్మిగూడారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని బాధితురాలు నుంచి వివరాలు సేకరించారు. సమీపంలోని సీసీ కెమెరాలు చెక్ చేసి అనుమానితుల ఫొటోలను సేకరించారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలిసులు తెలిపారు.

హైస్కూల్‌లో మాక్ అసెంబ్లీ

చిన్నశంకరంపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : చిన్నశంకరంపేట మండలంలోని ధర్పల్లి గ్రామ హైస్కూల్‌లో శుక్రవారం మాక్ అసెంబ్లీ కార్యక్రమాన్ని విద్యార్థులు నిర్వహించారు. స్పీకర్‌గా అఖిల, ముఖ్యమంత్రిగా వైష్ణవి, ఉపముఖ్యమంత్రిగా సంజన, మంత్రులుగా దుర్గా, మహేష్, స్వాతి, శ్రావ్య, వినయ్, ప్రతిపక్షనేతలుగా దుర్గా, లావణ్య, పూజ, వైష్ణవి వ్యవహరించారు. అసెంబ్లీ సమావేశాల మాదిరిగా అభివృద్ధిపై చర్చలు జరిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ సంతోష, బృందం తదితరులు పాల్గొన్నారు.



ధర్పల్లి హైస్కూల్ మాక్ అసెంబ్లీ నిర్వహిస్తున్న విద్యార్థులు

న్యూస్ బాక్స్

17న జిల్లాస్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు

మెదక్ అర్బన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఈనెల 17న జిల్లాస్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు జరగనున్నట్లు మెదక్ అదనపు కలెక్టర్ మెంచు నగేష్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పోటీల నిర్వహణపై జిల్లాలోని పీఈటీలతో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. 17న జిల్లాస్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలు ఉంటాయన్నారు. అదేరోజు ఉదయం 8 గంటల వరకు క్రీడాకారులందరూ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణానికి హాజరయ్యే విధంగా చూడాలని ఎంపీడీవోలను ఆదేశించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి డీవైఎస్‌వో నాగరాజు, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

16 జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

మెదక్ అర్బన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): 10వ తెలంగాణ స్టేట్ క్రాస్ కంట్రీ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల కోసం 16న సోమవారం మెదక్ స్టేడియంలో జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మధుసూదన్ తెలిపారు. అండర్-16, 18, 20 బాలబాలికలకు 2కె, 6కె, 8కె, 10కె రన్నింగ్ విభాగాల్లో ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు 22న నాగర్‌కర్నూర్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటారని ఆయన వెల్లడించారు. మిగతా వివరాలకు 9963005540 నంబరును సంప్రదించాలని సూచించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

మెదక్/ఝరాసంగం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాతూర్, మక్తభూపతిపూర్, రాజ్‌పల్లి విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా మండలంలోని పాతూర్, శవ్వపూర్, గంగాపూర్, రాయిన్‌పల్లి, తిమ్మనగర్, భూపతిపూర్, శివాయిపల్లి, మల్కాపూర్, బాలానగర్, తిమ్మక్కపల్లి గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని మెదక్ ట్రాన్స్‌కో ఏడీఈ మోహన్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 నుంచి 1 వరకు సరఫరా నిలిపేస్తామన్నారు. అలాగే మండల కేంద్రమైన ఝరాసంగంలో శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తామని ఏఈ సరళ తెలిపారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

మెదక్ కల్చరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ సీఎస్ఐ చర్చి కట్టడానికి 100 ఏళ్లు పూర్తయిన సందర్భంగా చర్చి అభివృద్ధికి రూ.29.18 కోట్లను కేటాయించినందుకుగానూ శుక్రవారం చర్చి కమిటీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, నిధుల కోసం కృషిచేసిన ఎమ్మెల్యే రోహిత్‌రావు చిత్రపటాలకు చర్చి ప్రధాన గుమ్మం వద్ద క్షీరాభిషేకం చేశారు.

'రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలి'

జహీరాబాద్: రైతులు విధిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని భూసార పరీక్ష నిపుణులు డా.స్వామి, ఏఈవో ప్రదీప్ పేర్కొన్నారు. మండలంలోని రంజోల్, హుగ్గెల్లిలో రైతువేదికల్లో రైతులు, విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.

'ధర్మాగ్రహ దీక్షను జయప్రదం చేయాలి'

నారాయణఖేడ్/చిన్నశంకరంపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఈనెల 17న తపస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధర్మాగ్రహ దీక్షను జయప్రదం చేయాలని తపస్ డివిజన్ అధ్యక్షుడు చంద్రకాంత్ కోరారు. శుక్రవారం నారాయణఖేడ్ ఎమ్మార్సీ వద్ద తపస్ ఉపాధ్యాయ సంఘం నాయకులతో పోస్టర్లను ఆవిష్కరించారు. చిన్నశంకరంపేటలో తపస్ మెదక్ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్ ఆధ్వర్యంలో మడూర్ హైస్కూల్‌లో ధర్మాగ్రహ దీక్ష పోస్టర్‌ను ఆవిష్కరించారు.

15న మత సామరస్యంపై ఖేడ్‌లో బహిరంగ సభ

నారాయణఖేడ్: ఖేడ్ పోలీస్‌స్టేషన్ సమీపంలో 15న రాత్రి 8 గంటలకు 'ఖితాబ్‌ఏఆమ్ పేరిట' మత సామరస్యంపై బహిరంగసభను నిర్వహించనున్నట్లు జమియత్ ఆహ్లే బాధ్యులు తెలిపారు. కులమతాలకతీతంగా ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



గాయపడిన రాజేందర్‌రెడ్డి

శివ్వంపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన మండల పరిధిలోని సికింద్లాపూర్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని చండీ గ్రామానికి చెందిన పుల్లగుర్ల రాజేందర్‌రెడ్డి.. స్వగ్రామం చండీకి వస్తుండగా సికింద్లాపూర్ బంగారమ్మ ఆలయం సమీపంలోకి రాగానే బైక్ అదుపు తప్పి రాళ్లపైన పడ్డాడు. స్థానికులు 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

కాటేజీలకు మోక్షం లభించేనా..?

- పూర్తయి ఏడాది దాటుతున్నా ప్రారంభానికి నోచుకోని వైనం
- వినియోగంలోకి తీసుకురావడంలో తీవ్ర జాప్యం
- నేడు మంత్రి కొండా సురేఖ పర్యటన



వినియోగంలోకి రాని కాటేజీలు



నర్సాపూర్, డిసెంబు 13 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ సమీపంలోని అర్బన్ పార్కులో పర్యాటకులను ఆకట్టుకోవడానికి నిర్మించిన కాటేజీలు పూర్తయి ఏడాది దాటుతున్నా ప్రారంభించకుండా ఉంచడంతో నిరుపయోగంగా మారాయి. నేడు అటవీశాఖ మంత్రి కొండా సురేఖ రానున్నందున వాటికి మోక్షం లభిస్తుందేమోనని పర్యాటకులు ఎదురుచూస్తున్నారు.

అన్ని హంగులతో నిర్మించినా నిష్ప్రయోజనం

జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న నర్సాపూర్ అర్బన్ పార్కును సందర్శించడానికి హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున పర్యాటకులు వస్తున్నారు. ముఖ్యంగా సెలవు దినాల్లో ఈ పార్కు సందడిగా ఉంటుంది. దీంతో పర్యాటకులను మరింతగా ఆకట్టుకోవడమే కాకుండా తద్వారా అటవీశాఖకు ఆదాయం కూడా సమకూరేలా కాటేజీలు నిర్మించారు. 600 చదరపు అడుగులకు తగ్గకుండా అనేక సదుపాయలు కల్పించారు. కుటుంబసభ్యులంతా వెళ్లి ఒక రాత్రి కాటేజీలో ఉండి తిరిగి ఉదయం హైదరాబాద్‌కు వెళ్లే అవకాశం ఉన్నది. కాటేజీ ఉండే సమీపంలో ఉన్న చెరువు అందాలతో పాటు అర్బన్‌పార్కులోని అందాలను ఆస్వాదించేలా చుట్టూ అద్దాలతో నిర్మించారు. రూ.3 కోట్లతో ఐదు కాటేజీలు, రెండు అతిథి గృహాలు, వంటగది, డైనింగ్‌హాల్, రిసెప్షన్ సెంటర్, నీటి ట్యాంకు నిర్మించారు. వీటి నిర్వహణను టెండరు ప్రక్రియ ద్వారా ఇప్పటికే ఓ సంస్థకు అప్పగించినట్లు సమాచారం. అయితే ఈ సంస్థ వారు ఇంకా వినియోగంలోకి తేకుండా తీవ్ర జాప్యం చేస్తుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. 14న మంత్రి కొండా సురేఖ రానున్నందున స్థానిక నాయకులు మంత్రి దృష్టికి తెచ్చి కాటేజీలను పర్యాటకులకు అందుబాటులో తెస్తారన్న ఆశతో స్థానికులు ఆశిస్తున్నారు. అదే విధంగా అర్బన్‌పార్కులో పర్యాటకులకు మరిన్ని సదుపాయాలు, సౌకర్యాలు కల్పిస్తామని చెబుతున్నా.. నిధులు లేమితో వాటి ఏర్పాటు కావడం లేదు. వాటిపై కూడా మంత్రి దృష్టిసారిస్తారో లేదో చూడాలి.

రేవంత్‌రెడ్డివి పిట్టలదొర మాటలు: ఎమ్మెల్యే



ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రేవంత్‌రెడ్డివి పిట్టలదొర మాటలని, ఏ ఒక్క మాటకు కట్టుబడి ఉండడని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఎద్దేవా చేశారు. సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద రిలే నిరాహార దీక్ష చేస్తున్న సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులకు సంఘీభావం తెలిపిన ఆయనకు సమస్యలు పరిష్కరించాలని ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాగైనా అధికారంలోకి రావాలని ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి అడ్డగోలు హామీలు ఇచ్చి అన్నివర్గాల ప్రజలను మోసం చేశారని అన్నారు. 2023లో దీక్ష చేస్తున్న ఉద్యోగులకు రేవంత్‌రెడ్డి మద్దతు తెలిపి అధికారంలోకి రాగానే మీ సమస్యలను పరిష్కరిస్తామని హామీఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి ఏడాదైనా సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులను పట్టించుకోకుండా గాలికొదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, విజయేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు వెంకటేశ్వర్లు, మధుసూదన్‌రెడ్డి, శ్రవణ్‌రెడ్డి, విఠల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, కార్పొరేటర్

పటాన్‌చెరు, డిసెంబరు, 13 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పటాన్‌చెరులోని క్యాంపు కార్యాలయంలో కార్పొరేటర్లు మెట్టు కుమార్‌యాదవ్, పుష్పనగేష్‌తో కలిసి రూ.2.8 కోట్ల కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాములుగౌడ్, సోమిరెడ్డి, విజయ్‌కుమార్, పరమేష్‌యాదవ్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

పశు పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలి

- మెదక్ పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వెంకటయ్య



వరిగుంతంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న మెదక్ జిల్లా అధికారి వెంకటయ్య

కొల్చారం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పశువుల పెంపకాలపై ప్రత్యేక దృష్టిసారించాలని మెదక్ పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వెంకటయ్య అన్నారు. శుక్రవారం కొల్చారం మండలం వరిగుంతం గ్రామంలో జిల్లా పశు ఘణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పశు సంవర్ధక శాఖ సహకారంతో పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో 90 శాతం అధిక పాల దిగుబడి సామర్థ్యం గల మేలు జాతి ఆడదూడలు పుట్టించి వాటి ద్వారా రైతులకు ఆదాయం పెంపొందించాలన్నారు. ఈ శిబిరంలో 32 పశువులకు గర్భస్థ పరీక్షలు, 18 పశువులకు సాధారణ చికిత్సలు, 4 పశువులకు కృత్రిమ గర్భధారణ, 41 దూడలకు నట్టల నివారణ మందులు వేశామన్నారు. ఈ కార్యక్రమంలో కొల్చారం మండల పశు వైద్య అధికారి డాక్టర్ వీరేశం, కౌడిపల్లి మండల పశు వైద్యాధికారి డాక్టర్ జి.రాజు, సూపర్‌వైజర్ శ్రీనివాస్ రెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్ గట్టయ్య, రైతులు పాల్గొన్నారు.

మా భూములు మాకివ్వాలి

- డీడీఎస్ వ్యవస్థాపక మహిళా సభ్యుల డిమాండ్



ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌజ్‌లో మాట్లాడుతున్న డీడీఎస్ వ్యవస్థాపక డైరెక్టర్ గోపాల్, మహిళా సభ్యులు

జహీరాబాద్ డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : గతంలో డీడీఎస్ మహిళా సంఘాల సభ్యులుగా కొనసాగిన వారికి సంబంధించిన భూములు, జమచేసిన డబ్బులు, రివాల్వింగ్‌ఫండ్‌ను ఇవ్వాలని డీడీఎస్ వ్యవస్థాపక డైరెక్టర్ గోపాల్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌజ్‌లో వ్యవస్థాపక సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. జహీరాబాద్ ప్రాంతంలో డీడీఎస్ ఏర్పాటు సమయంలో గ్రామాలవారీగా డీడీఎస్‌లో సభ్యులుగా చేరిన వారికి సంబంధించిన జమ రూ.2 కోట్లు ఉండగా, రివాల్వింగ్ ఫండ్ రూ.12 కోట్ల పైచిలుకు ఉందని, 100 ఎకరాల పైచిలుకు భూములున్నాయని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం డీడీఎస్‌లో పనిచేస్తున్న కొందరు తమకు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారన్నారు. తమకు న్యాయం జరిగే వరకు ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. ఈ సమావేశంలో డీడీఎస్ వ్యవస్థాపక సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న జాతరకు కవితకు ఆహ్వానం



ఎమ్మెల్సీ కవితతో భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ శ్రేణులు

నారాయణఖేడ్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అనంత్‌సాగర్‌లో ఈనెల 15న ఆదివారం జరుగనున్న మల్లన్న జాతరకు రావాలని ఎమ్మెల్సీ కవితను మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు, పార్టీ మండలాధ్యక్షులు పరమేశ్వర్, అనంత్‌సాగర్ మాజీ ఉపసర్పంచ్ సిద్ధులు కలిసి శుక్రవారం ఆహ్వానపత్రాన్ని అందజేశారు. ఆదివారం ఉదయం 11 గంటలకు నిర్వహించే కల్యాణోత్సవానికి ఎమ్మెల్సీ కవిత హాజరు కానున్నట్లు మాజీ ఎమ్మెల్యే తెలిపారు.

జిల్లావ్యాప్తంగా 400 పైచిలుకు కొత్త పోలీసులు: ఎస్పీ రూపేష్



సమావేశంలో మాట్లాడుతున్న సంగారెడ్డి ఎస్పీ రూపేష్

జహీరాబాద్ డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 400 పైచిలుకు కొత్త పోలీసులు వచ్చారని సంగారెడ్డి ఎస్పీ రూపేష్ తెలిపారు. శుక్రవారం జహీరాబాద్ పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మిక తనిఖీలు చేసి పోలీసులు పనితీరు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జహీరాబాద్ మీదుగా గంజాయి రవాణాను అక్రమంగా తీసుకెళ్లేవారిపై ఇప్పటికే కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. జహీరాబాద్ డివిజన్ పోలీసుల పనితీరు భేష్ అని ఆయన కితాబిచ్చారు. ఈ సమావేశంలో డీఎస్పీ రామ్మోహనరెడ్డి, సీఐలు శివలింగం, హన్మంతు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

నల్లపోచమ్మ ఆలయ హుండీ లెక్కింపు

కౌడిపల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తునికి నల్లపోచమ్మ ఆలయం హుండీని శుక్రవారం ఉమ్మడి దేవదాయ కమిషనర్, నల్లపోచమ్మ ఆలయ ఇన్‌చార్జి రంగారావు, ధర్మాదాయ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఐదునెలలకుగానూ అమ్మవారికి రూ.5,98,690 లక్షల ఆదాయం వచ్చిందని, ఈ డబ్బును ఆలయ అభివృద్ధికి ఖర్చు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జి వెంకట్‌రెడ్డి, మాజీ చైర్మన్ మల్లేశం పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్రీడలకు ఖమ్మంపల్లి పాఠశాల విద్యార్థులు

మునిపల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లింగంపల్లి గురుకుల పాఠశాల పాఠశాలలో నిర్వహించిన సీఎం కప్ క్రీడల్లో ఖమ్మంపల్లి జడ్పీహెచ్ఎస్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న మెహరాజ్, లత, 9వ తరగతి చదువుతున్న సిరిచందన జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా హెచ్ఎం లక్ష్మారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు సురేందర్, ఉపాధ్యాయులు వినోద్, హేమలత, ప్రవీణ, సుధాకర్, రాజారావు, అనిత, ఆనంద్, రాజ్, పద్మమ్మ విద్యార్థులను అభినందించారు.

పొలంలో తెగిపడ్డ విద్యుత్ వైర్లు

- వారంరోజులుగా పట్టించుకోని అధికారులు
- ఎండిపోతున్న వరినార్లు



పంట పొలంలో తెగిపడ్డ విద్యుత్ వైర్లు

శివ్వంపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పంట పొలంలో ఉన్న విద్యుత్ స్తంభం ధ్వంసమై ఎల్‌టీ వైర్లు తెగిపడి విద్యుత్ అంతరాయం ఏర్పడింది. వారంరోజులు గడుస్తున్నా విద్యుత్ అధికారులు స్పందించకపోవడంతో వరినాళ్లకు నీరు అందక ఎండుముఖం పడుతున్నాయని రైతులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని కొంతాన్ పల్లి గ్రామంలో వారంరోజుల క్రితం కలుప వ్యాపారులు చెట్లను కోస్తుండగా కొమ్మలు పంట పొలంలోని విద్యుత్ వైర్ల మీద పడ్డాయి. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర లూజ్ పోల్ ధ్వంసమై వైర్లు తెగిపడ్డాయి. ఈ విషయాన్ని స్థానిక లైన్‌మన్ జీవన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని బాధిత రైతులు ప్రకాష్, నవీన్, జోగులు వాపోయారు. అధికారులు స్పందించి వైర్లకు మరమ్మతు చేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై లైన్‌మన్ జీవన్‌రెడ్డిని సంప్రదించగా లేబర్ కొరతతో మరమ్మతులకు ఆలస్యమైందని, త్వరలో సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

- ఎంపీడీవో భారతి
- పలు మండలాల్లో ఇళ్ల సర్వే



రాజనెల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న కోహీర్ ఎంపీడీవో భారతి

కోహీర్/మునిపల్లి/వెల్దుర్తి/చేగుంట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆయా గ్రామాల్లో మొబైల్ యాప్ ద్వారా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీవో భారతి పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీడీవో మండలంలోని రాజనెల్లి గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి వినోద్‌కుమార్, కార్యదర్శులు తుక్కారామ్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. మునిపల్లి మండలంలోని ఇందిరమ్మ ఇళ్ల సర్వేను రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ మంతూరి సుధాకర్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సతీష్‌కుమార్ ఎంపీడీవో డాక్టర్ హరినందన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాంరెడ్డి, పంచాయతీ కార్యదర్శి సంతోష, నాయకులు పాల్గొన్నారు. వెల్దుర్తి మండలంలోని యశ్వంతరావుపేట, మంగళపర్తి, మనేపల్లి, ధర్మారం గ్రామాల్లో కొనసాగుతున్న సర్వేను ఎంపీవో విఘ్నేశ్వర్ పరిశీలించారు. చేగుంట మండలంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నవీన్‌కుమార్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో చేగుంట ఈవో నరేష్, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్రషర్ ఏర్పాటు అనుమతులు రద్దు చేయాలి

- సంగారెడ్డి కలెక్టర్‌కు నల్తూరు వాసుల వినతి



కలెక్టర్ వల్లూరు క్రాంతికి వినతిపత్రం అందజేస్తున్న నల్తూరు వాసులు

జిన్నారం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నల్తూరు గ్రామ పరిధిలో కంకర క్వారీ ఏర్పాటు కోసం ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని నల్తూరు వాసులు, నాయకులు సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతిని శుక్రవారం కలిసి విజ్ఞప్తి చేశారు. గ్రామ పరిధి 160 సర్వే నెంబరులో నూతన స్టోన్‌క్రషర్ ఏర్పాటు కోసం ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని వినతిపత్రంలో కరారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే క్వారీ ఏర్పాటు చేపట్టవద్దని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఇచ్చిన లేఖనూ కలెక్టర్‌కు అందజేశారు. అనంతరం మైనింగ్ ఏడీ కార్యాలయంలోనూ వినతిపత్రాన్ని అందజేశారు.

సీసీఐ కొనుగోలు కేంద్రాల తనిఖీ



సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఓఎస్డీ, జీఎం

మునిపల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మేళాసంగం గ్రామ సమీపంలోని మూడు సీసీఐ కేంద్రాలను సీసీఐ (ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ) ఓఎస్డీ అమర్నాథ్‌రెడ్డి, వరంగల్ జీఎం అర్జున్‌దావె శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీసీఐ కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని సిబ్బందిని సూచించారు. అలాగే పత్తి క్వింటాల్‌కు రూ.7,471 సీసీఐ కొనుగోలు చేస్తుందని, ప్రస్తుతం పత్తిలో క్వాలిటీ తగ్గడంతో రూ.50 తగ్గించి రూ.7,421లకు కొనుగోలు చేయాలన్నారు. వారివెంట మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, సీసీఐ సీవో వరుణ్ రఘువీర్, సిబ్బంది తేజ, సంతోష్ ఉన్నారు.

హోరాహోరీగా కుస్తీ పోటీలు

టేక్మాల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కాదులూర్ గ్రామ శివారులోని మల్లికార్జునస్వామి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన కుస్తీ పోటీలు హోరాహోరిగా సాగాయి. శనివారం నిర్వహించిన పోటీల్లో జిల్లాకు చెందిన మల్లయోధులతో పాటు సమీపంలోని కర్ణాటక, మహారాష్ట్రలోని పలు ప్రాంతాలకు చెందిన మల్లయోధులు తరలివచ్చారు. ఈ పోటీల్లో మహారాష్ట్రలోని ఉద్గిర్‌కు చెందిన అభిజిత్ విజేతగా నిలిచాడు. అతడికి ఆలయ కమిటీ సభ్యులు వెండి కడియం బహూకరించారు.

'గిరిజన రైతుకు బేడీలు వేయడం దారుణం'

నారాయణఖేడ్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రిమాండ్‌లో ఉన్న లగచర్ల గిరిజన రైతుకు బేడీలు వేసి వైద్యశాలకు తీసుకెళ్లడం దారుణమని గిరిజన నాయకులు అన్నారు. శుక్రవారం ఖేడ్ బీఆర్ఎస్ కార్యాలయంలో ఖేడ్ మాజీ జడ్పీటీసీ లక్ష్మీబాయిరవీందర్‌నాయక్, మాజీ సర్పంచులు రాజునాయక్, రవీందర్‌నాయక్, విఠల్‌రావు, సాయిలు, గిరిజన నాయకులు లక్ష్మణ్ నాయక్, శంకర్‌నాయక్, సర్దార్‌నాయక్, వెంకట్, శ్రీనివాస్, రాందాస్ తదితరులు విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి తన అల్లుడి కోసం గిరిజనుల భూములు లాక్కోవడానికి యత్నించడమే కాకుండా, అక్రమంగా అరెస్టు చేసి జైల్లో పెట్టి అస్వస్థతకు గురైతే బేడీలు వేసి వైద్యశాలకు తీసుకెళ్లడం దారుణమన్నారు.

'విద్యార్థిని తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులదే కీలకపాత్ర'

జోగిపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో తల్లిదండ్రుల పాత్రే కీలకమని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రజిత పేర్కొన్నారు. శుక్రవారం జోగిపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల (కో ఎడ్యుకేషన్)లో పేరెంట్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాశాలలో ఉండే సమయం కంటే, ఇంట్లో ఉండే సమయమే ఎక్కువని, అందుకే తమ పిల్లల పట్ల శ్రద్ధ వహించాలన్నారు. ముఖ్యంగా తమ పిల్లలను సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచాలని సూచించారు. ఈ సమావేశంలో కళాశాల అధ్యాపకులు శ్రీనివాస్, విఠల్, అనిత, శ్రవణ్, గోవర్ధన్‌రెడ్డి, నూనె శ్రీనివాస్, జీల మల్లేశం, రాజ్ కుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఖేడ్‌లో బటర్‌ఫ్లై లైట్లకు మరమ్మతులు

నారాయణఖేడ్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని బటర్‌ఫ్లై వీధిదీపాలకు శుక్రవారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మరమ్మతులు చేపట్టారు. పట్టణంలోని మంగల్‌పేట, రాయిపల్లి మార్గాల్లో పలు చోట్ల దీపాలు వెలుగక రాత్రుల్లో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో క్రేన్ సహాయంతో మరమ్మతులు చేపట్టారు. ఈ కార్యక్రమాలను మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్, పర్యవేక్షించారు.

'ఎన్నికలకు పార్టీల నాయకులు సహకరించాలి'

నాగల్‌గిద్ద, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు అన్ని పార్టీల నాయకులు సహకరించాలని ఎంపీడీవో మహేశ్వర్‌రావు కోరారు. శుక్రవారం స్థానిక సంస్థల ఎన్నికలపై ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో మండలంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మాణిక్‌రావుపటేల్, సీనియర్ నాయకులు గుండేరావుపటేల్ పాల్గొన్నారు.

ఘనంగా దత్తయజ్ఞ పూజలు

ఝరాసంగం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బర్దీపూర్‌లో గల దత్తగిరి ఆశ్రమంలో శుక్రవారం దత్తయజ్ఞ పూజలు ప్రారంభమయ్యాయి. ఉదయం సుప్రభాత సేవలు, నవగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కర్ణాటకతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. 21 యజ్ఞ గుండాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దంపతులు పాల్గొని పూజలు చేశారు. ఆశ్రమ పీఠాధిపతి వైరాగ్య శిఖమణి అవదూతగిరి మహరాజ్, బావి పీఠాధిపతి డాక్టర్ సిద్ధయ్యస్వామి మాట్లాడుతూ లోక కళ్యాణార్థం హోమాలు చేపడుతున్నామన్నారు. అనంతరం ఆశ్రమంలో అన్నదానం నిర్వహించారు.

తూప్రాన్ 13వ వార్డులో సీసీరోడ్డు పనులు



సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్

తూప్రాన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణంలోని 13వ వార్డులో నూతనంగా ప్రజల సౌకర్యార్థం సీసీ రోడ్డు వేసినట్లు తూప్రాన్ మున్సిపల్ వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం 13వ వార్డులో వేస్తున్న సీసీరోడ్డు పనులను పరిశీలించారు. వార్డులో బుడ్డ శ్యామల ఇంటి నుంచి వాటర్ ట్యాంకు వరకు సీసీరోడ్డు వేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పల్లెర్ల రవీందర్‌గుప్తా ప్రజలు పాల్గొన్నారు.

మార్మోగిన అయ్యప్ప శరణుగోష

కొండాపూర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గొల్లపల్లిలో అయ్యప్ప శరణు గోషతో శుక్రవారం మార్మోగింది. గంటస్వామి నాగేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప మహాపడిపూజను గురుస్వాములు ప్రకాశ్, గంగాధర్, గురుస్వాముల ఆధ్వర్యంలో నిర్వహించారు.